క్లుప్తంగా

మృత్యుంజయస్వామికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మృత్యుంజయస్వామికి సోమవారం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గణపతిపూజ, కలశ స్థాపన పూజలు చేశారు. స్వామివారికి చందనం, నారికేళ్ల, పసుపు, కుంకుమ, విభూధి వంటి వాటితో అభిషేకాలు చేసి, సుందరంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, వేదపండితులు పాల్గొన్నారు.

ఆన్‌కాల్ డ్రైవర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాళహస్తి: స్థానిక ఆర్టీసీ డిపోలో ఆన్‌కాల్ డ్రైవర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డిపో మేనేజరు మునిచంద్రయ్య తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆన్‌కాల్ డ్రైవర్లుగా పనిచేసేందుకు ఆసక్తి గల వారు తమ 18 నెలలు పూర్తయిన హెవీ లైసెన్సుతో పాటు ఆధార్‌కార్డు, దరఖాస్తులు మంగళవారం నుంచి ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు డిపో కార్యాలయంలో సమర్పించాలన్నారు. మరిన్ని వివరాలకు 9959297947, 9063774464ను సంప్రదించాలని కోరారు.

వంద శాతం అక్షరాస్యతే లక్ష్యం



మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటరత్నమ్మ

బుచ్చినాయుడుకండ్రిగ: మండల సమాఖ్య మహిళ సభ్యులందరూ 2029 లోపు వంద శాతం అక్షరాస్యత సాధించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అక్షర ఆంధ్ర ఉల్లాస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ఎంపీడీఓ వెంకటరత్నమ్మ తెలిపారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో మండల సమాఖ్య కార్యాలయంలో ఆంధ్ర ఉల్లాస్‌పై వలంటీర్ టీచర్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. మండల విద్యాశాఖాధికారి రవీంద్రనాథ్ మాట్లాడుతూ, మండలంలో 7,500 మంది నిరక్షరాస్యులుగా ఉన్నారని, వీరందరినీ అక్షరాస్యులుగా వలంటీర్లు తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం మునెయ్య, ఏపీఓ దేవరి, సీసీలు వెంకటరత్నం, వీరజిన్నప్ప, పయని, జీవ తదితరులు పాల్గొన్నారు.

చేనేత వస్త్రాలను ఆదరిద్దాం


సమావేశంలో మాట్లాడుతున్న ఆదిమూలం

నారాయణవనం: సాంప్రదాయ నూలు వస్త్రాల ఉత్పత్తులను వినియోగంతో చేనేత, మరమ్మగ్గ రంగాన్ని ఆదరించాలని సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం పిలుపునిచ్చారు. జాతీయ చేనేత వారోత్సవాలలో భాగంగా సోమవారం నారాయణవనంలో చేనేత, మరమ్మగ్గ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఆధునిక పోకడలతో కులవృత్తులకు ఆదరణ కొరవడిందని, ప్రభుత్వ రాయితీలను, సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ నేతన్నలు అభివృద్ధి చెందాలన్నారు. నారాయవనంలో ఏర్పాటవుతున్న చేనేత క్లస్టర్‌కు రూ.98 లక్షలు విడుదలైందని, 90 శాతం రాయితీతో మగ్గాలను, జాకాడ్, లిఫ్టింగ్ మెషిన్లను ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో జౌళిశాఖ ఏడీ రమేష్, ఎంపీడీఓ అరుణ, చేనేత కార్మికులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్ర మంత్రికి సాదర స్వాగతం

రేణిగుంట: అన్నమయ్య జిల్లా పర్యటన నిమిత్తం రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ రేణిగుంట అంతర్జాతీయ విమానాశ్రయానికి సోమవారం చేరుకున్నారు. ఆయనకి పార్టీ నాయకులు, కార్యకర్తలు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గాన కోడూరుకు వెళ్లారు.

మసకబారుతున్న సేవలు

కల్కి ట్రస్టుకు చెందిన అమ్మా భగవాన్ సేవా కార్యక్రమాలు క్రమేణా మసకబారుతున్నాయి. పదేళ్ల క్రితం ప్రారంభించిన పలు సేవా కార్యక్రమాలు కనుమరుగవుతున్నాయి. వరదయ్యపాళెం, బీఎన్‌కండ్రిగ, తడ మండలాల్లో వారు ఎంపిక చేసిన 26 గ్రామ పంచాయతీల్లో పలు అభివృద్ధి పనులు చేస్తామని ట్రస్ట్ ప్రకటించినప్పటికీ క్షేత్రస్థాయిలో కార్యరూపం దాల్చలేదు. కొన్ని కార్యక్రమాలకు పూనుకున్నప్పటికీ అవి కూడా నిర్వహణ లోపంతో అటకెక్కుతున్నాయి. లక్షలు వెచ్చించి నిర్మించిన భవనాలు, శుద్ధ జలాల యూనిట్లు సైతం నిరుపయోగమవుతున్నా పట్టించుకునే దిక్కు లేదు.


తొండంబట్టులో డోర్లు విరిగిపోయి శిథిలావస్థకు చేరుకున్న అమ్మా భగవాన్ కమ్యూనిటీ భవనం


నెల్లటూరులో నిరుపయోగంగా ఉన్న అమ్మా భగవాన్ కమ్యూనిటీ భవనం

- నిరుపయోగంగా మారిన కమ్యూనిటీ భవనాలు
- గ్రామాల్లో నీరుగారిన వైనం
- 26 గ్రామ పంచాయతీల్లో అటకెక్కిన అమ్మా భగవాన్ సేవా కార్యక్రమాలు

వరదయ్యపాళెం: ట్రస్ట్ ఎంపిక చేసిన 26 గ్రామ పంచాయతీల్లో స్థానిక ప్రజల సామాజిక అవసరాల కోసం కమ్యూనిటీ భవనాలను నిర్మించారు. అయితే ఆ భవనాలు ప్రస్తుతం పూర్తిగా వాడుకలో లేవు. ఆ భవనాలు శిథిలమై పోతున్నా పట్టించుకోవడం లేదు. అప్పట్లో గ్రామస్తులు తీర్మానం చేసి ట్రస్టు వారికి కేటాయించిన 20 సెంట్ల భూమిలో రూ.17లక్షలతో అమ్మా భగవాన్ సేవా ట్రస్ట్ కమ్యూనిటీ భవనాలను నిర్మించింది. ఆ కమ్యూనిటీ భవనాల్లో స్థానిక గ్రామస్తుల అవసరాలకు సంబంధించి వివాహాలు, ఇతర శుభకార్యాలను నామమాత్రపు అద్దె చెల్లించి నిర్వహించేవారు. ఇప్పుడా భవనాలు అతీగతీ లేకుండా పోయాయి. రూ. 4కోట్లతో సుమారు 26 గ్రామ పంచాయతీల్లో నిర్మించినప్పటికీ ఆ భవనాలు పాడైపోతున్నా వాటిపై ట్రస్ట్ దృష్టిసారించడం లేదు. కొన్ని భవనాలకు డోర్లు సైతం పాడై పశువులు, ఇతరత్రా జీవాలు వెళ్తునప్పటికీ నియంత్రణ చేసే పరిస్థితి లేదు.

అటకెక్కిన సేవా కార్యక్రమాలు

వరదయ్యపాళెంలోని అమ్మా భగవాన్ సేవా ట్రస్ట్ యాజమాన్యం గడిచిన ఐదేళ్లుగా సేవా కార్యక్రమాలను క్రమేణా అటకెక్కించింది. పదేళ్ల క్రితం ఆదర్శ గ్రామాలుగా ఎంపిక చేసి అన్నిరకాల అభివృద్ధి కార్యక్రమాలు చేస్తామని ప్రకటించింది. బీఎన్‌కండ్రిగ, వరదయ్యపాళెం, తడ మండలాల్లో 26 గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేసేందుకు అప్పట్లో ఎంపిక చేశారు. ఆ దిశగా కొన్నిచోట్ల కమ్యూనిటీ భవనాలు, శుద్ధజలాల ప్లాంట్లు నిర్మించింది. అయితే అవన్నీ పూర్తిగా కనుమరుగవడం గమనార్హం. అంతేకాక ఎంపిక చేసిన గ్రామాల్లో ఇతర మౌలిక వసతులు కల్పిస్తామన్న హామీ ఆచరణకు నోచుకోలేదు.

కనిపించని స్వచ్ఛ భారత్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పిలుపునిచ్చిన స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో అమ్మా భగవాన్ సేవా ట్రస్ట్ భాగస్వామ్యం అవుతుందని స్వయాన నిర్వాహకులే ప్రకటించారు. ఆ దిశగా కొన్ని రోజుల పాటు వరదయ్యపాళెం, బత్తలవల్లం గ్రామ పంచాయతీలతో పాటు తడ-వరదయ్యపాళెం ప్రధాన రోడ్డు మార్గంలో పారిశుద్ధ్య కార్మికులను ఏర్పాటు చేసి ట్రైసైకిళ్లతో ప్లాస్టిక్ వ్యర్థాలను, ఇతర చెత్తాచెదారాలను శుభ్రం చేయించేది. అయితే ఇప్పుడా కార్యక్రమాలేవీ చేయడం లేదు.

కనుమరుగైన కంప్యూటర్ శిక్షణ

గతంలో విద్యార్థుల్లో ఇంగ్లిష్ నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ఉచితంగా ట్రస్ట్ ద్వారా విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణా తరగతులు నిర్వహించేవారు. అలాగే స్పోకెన్ ఇంగ్లిష్, టైలరింగ్‌పై శిక్షణ ఇచ్చేవారు. ఇప్పుడవేవీ నిర్వహించడం లేదు.

సర్వత్రా చర్చనీయాంశం

గతంలో తరచూ వరదయ్యపాళెం, బీఎన్‌కండ్రిగ, ఇతర ప్రాంతాల్లో తరచూ పలు సేవా కార్యక్రమాలు నిర్వహించేవారు. ప్రధానంగా ఉచిత వైద్యశిబిరాలు, కంటి పరీక్షల శిబిరాలు ఏర్పాటు చేసేవారు.. అలాగే గ్రామ పంచాయతీలకు వీధి లైట్లు, ఇతర మౌలిక వసతులు కల్పించేవారు. ఇప్పుడీ సేవలకు స్వస్తి పలకడంతో ప్రజల్లో చర్చనీయాంశమైంది. అంతేకాకుండా కీలకంగా వ్యవహరించే ట్రస్టు ప్రతినిధులు సైతం స్థానికంగా అందుబాటులో లేకపోవడం, వారిని ఇతర ప్రాంతాలకు పంపడంతో చర్చకు తావిచ్చింది. సేవా కార్యక్రమాలకు క్రమేణా దూరం కావడానికి కారణమేమిటో తెలియాల్సి ఉంది.

పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

- ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని స్పష్టం


పోలీస్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

కేవీబీపురం: స్థానిక పోలీస్ స్టేషన్‌ను తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం ఎస్ఐ నరేష్, పోలీసులతో సమీక్షించారు. గ్రేవ్ కేసులు, చోరీలు, ల్యాండ్ గొడవలపై ప్రత్యేక దృష్టి సారించి, శాంతి భద్రతలను పరిరక్షించాలని ఆదేశించారు. వినాయక చవితి వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. కొత్త చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో బ్యానర్లు ఏర్పాటు చేయాలన్నారు. మరోవైపు గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల నియంత్రణపై దృష్టి పెట్టి, అనుమానితులపై ప్రత్యేక నిఘా ఉంచాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. పలు కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను కోర్టు అనుమతితో వేలం వేయాలని ఆదేశించారు.

గడువులోపు పరిష్కారం చూపాలి


అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

శ్రీకాళహస్తి: పీజీఆర్‌ఎస్‌లో వచ్చే అర్జీలకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి గడువులోపు పరిష్కారం చూపాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని పంచాయతీరాజ్ అతిథి గృహంలో సోమవారం నియోజవకర్గ స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. అర్జీదారుల నుంచి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, కలెక్టర్ వెంకటేశ్వర్, ఆర్డీవో భానుప్రకాస్‌రెడ్డి అర్జీలు స్వీకరించారు. సుమారు 1,500 వరకు అర్జీలు వచ్చాయి. శ్రీకాళహస్తి డివిజన్‌లోని మండలాల అధికారులు హాజరయ్యారు. కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ పిజిఆర్‌ఎస్ నందు ఇచ్చిన ప్రతి అర్జీకి తగిన న్యాయం చేస్తామని తెలిపారు. మళ్లీ సెప్టెంబర్‌లో మరోసారి నియోజకవర్గ సాఠథయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పీజీఆర్‌ఎస్ అర్జీలను గడువులోపు పరిష్కరించాలని ఆదేశించారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల వద్ద నుంచి స్వీకరించిన ప్రతి అర్జీని ఆన్‌లైన్‌లో నమోదు చేసి, తానే ప్రత్యేకంగా పరిశీలించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ నరసింహమూర్తి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ భరత్ రెడ్డి, శ్రీకాళహస్తి మునిసిపల్ కమిషనర్ పి.భవాని ప్రసాద్, రేణిగుంట, శ్రీకాళహస్తి, ఏర్పేడు, తొట్టంబేడు తహసీల్దార్లు, పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

టెన్త్ ప్రతిభావంతులకు నగదు ప్రోత్సాహకాలు


నగదు అందజేస్తున్న హెచ్‌ఎం రమణయ్య

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక జెడ్పీ హైస్కూల్లో పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులలో పాసైన సుప్రియ, జ్ఞానేశ్వర్‌కు సోమవారం ప్రధానోపాధ్యాయులు రమణయ్య, దాత రమణయ్యనాయుడు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. కారాకొల్లుకు చెందిన రమణయ్యనాయుడు ప్రతి ఏటా పదవ తరగతి పరీక్షలో అత్యధిక మార్కులు సాధించిన ఇద్దరు విద్యార్థులకు ఒక్కొక్కరి రూ. 8 వేల చొప్పున ఆర్థిక సాయం చేస్తున్నారు. హెచ్‌ఎం మాట్లాడుతూ, సుప్రియ, జ్ఞానేశ్వర్ ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారని, బాగా చదువుకుని స్కూలుకు, గ్రామానికి పేరు తేవాలని ఆకాంక్షించారు. రమణయ్యనాయుడు పేద విద్యార్థులకు ఆర్థిక సాయం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో టీచర్లు పాల్గొన్నారు.

గంగమ్మ పసుపు, కుంకుమ ఊరేగింపు


గంగమ్మ పసుపు, కుంకుమను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

నారాయణవనం: బుధవారం ఏడు గంగమ్మల జాతర నేపథ్యంలో గంగమ్మ ప్రతిమ తయారీకి వినియోగించే పసుపు, కుంకమలను నారాయణవనం వీధుల్లో ఊరేగించారు. బుధవారం నారాయణవనం, సముదాయం, వీకే పాళ్యం, ఎగువ, దిగువ బొప్పరాజుపాళ్యం, నాగిలేరు గ్రామాలలో ఏడు గంగమ్మలు కొలువుదీరుతాయి. ఇందులో భాగంగా నారాయణవనంలో బలిజ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే గంగ జాతరలో అమ్మవారి ప్రతిమకు వినియోగించే పసుపు, కుంకమలను నారాయనవనం వీధుల్లో ఊరేగించారు. మహిళల కర్పూర హారతులు ఇచ్చారు. మంగళవారం ఉదయం పేరంటాల గరిక ఊరేగింపు ప్రారంభమవుతుందని జాతర ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. మంగళవారం సాయంత్రం భారనారుషి ఆలయ సమీపంలోని రజక కాలనీ నుంచి అమ్మవారు సర్వ భూపాల వాహనంపై ఊరేగింపు ప్రారంభమై బుధవారం వేకువ జామున కోమటి బజారువీధిలో వీధి కూడలిలో కొలువుదీరుతారని చెప్పారు. దీనికి తగ్గట్లు ఏర్పాట్లు పూర్తి చేశామని ఉత్సవ నిర్వాహకులు శరత్ కుమార్, బాబు తెలిపారు. బుధవారం అర్ధరాత్రి అమ్మవారి నిమజ్జనం చేయనున్నారు. మట్లవారి వీధి, కోమటి బజారువీధులను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.

ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి యత్నం

- రైతుల అప్రమత్తతతో దొంగలు పరారీ


దొంగలు ధ్వంసం చేసేందుకు యత్నించిన ట్రాన్స్‌ఫార్మర్

బుచ్చినాయుడుకండ్రిగ: ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి దొంగలు విఫలయత్నం చేసిన సంఘటన ఆదివారం రాత్రి స్థానిక గ్రామ పంచాయతీలోని తంగెళ్లపురం పొలాలలో చోటుచేసుకుంది. వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్‌ను కిందకు దించి దానికి పగలగొట్టేందుకు దొంగలు యత్నిస్తుండగా రైతులు గమనించి కేకలు వేశారు. దీంతో దొంగలు ట్రాన్స్‌ఫార్మర్‌ను వదిలేసి పారిపోయారు. ఈ ఉదంతాన్ని ట్రాన్స్‌కో అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు రైతులు తెలిపారు.

తెలుగు తమ్ముళ్ల కుమ్ములాట!

- 'తొలి అడుగు సుపరిపాలన'లో వివాదం
- నీరువాయిలో ఇద్దరు నేతలు చొక్కాలు పట్టుకుని గొడవ పడినట్లు సమాచారం

నాగలాపురం: సత్యవేడు నియోజకవర్గంలో తెలుగు తమ్ముళ్ల మధ్య విభేదాలు తారా స్థాయికి చేరుకుంటున్నాయి. విభేదాలు కాస్త కుమ్ములాట వరకు వెళ్తోంది. తాజాగా సోమవారం సాయంత్రం పిచ్చాటూరు మండలం నీరువాయిలో జరిగిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఇరు వర్గాల మధ్య విభేదాలు తారా స్థాయికి చేరి ఒకరిపై ఒకరు చేయి చేసుకునే వరకు వెళ్లింది. సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమానికి నియోజకవర్గ కో-ఆర్డినేటర్ శంకర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అయితే నీరు వాయిలో ఒక వర్గం శంకర్ రెడ్డిని ఆహ్వానించగా, మరో వర్గానికి సమాచారం లేదని వారు ఆగ్రహించి కార్యక్రమాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో సత్యవేడు మండలం ఓబులురాజు కండ్రిగకు చెందిన సీనియర్ నాయకుడు కారుని అడ్డుకుని అతనిపై జరిగిన తోపులాటలో చొక్కా సైతం చినిగినట్లు సమాచారం! అదే సమయంలో అక్కడే ఉన్న కేవీబీ పురం మండలం మాజీ అధ్యక్షుడు బీసీ నాయకుడిపై కూడా చేయిచేసుకున్నట్లు సమాచారం. అయితే ఇరువురు నాయకులు నీరు వాయిలో వివాదానికి కారణమైన వారిపై పిచ్చాటూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అయితే పోలీసులు ఫిర్యాదు విషయాన్ని గోప్యంగా ఉంచడం గమనార్హం: నియోజకవర్గ టీడీపీలో రోజు రోజుకూ చోటుచేసుకుంటున్న పరిణామాలు పార్టీకి నష్టదాయకమని కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు.

మూలస్థానేశ్వరుడికి అభిషేకాలు

రేణిగుంట: మండలంలోని గాజుల మండ్యం గ్రామంలో వెలసిన శ్రీ కామాక్షి సమేత మూలస్థానేశ్వర ఆలయంలో శ్రావణమాసం మూడవ సోమవారం అర్చకులు దక్షిణామూర్తి ఆధ్వర్యంలో స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. ఉభయదారులు కాపి రెడ్డిగారి కవిత, చంద్రశేఖర్ రెడ్డి దంపతులు, ఆలయ నిర్వాహకులు జువ్వల ధనుంజయ రెడ్డి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

టీపీ కోట ప్రైమరీ స్కూల్‌లో వాటర్ బెల్


వాటర్‌బెల్ సమయంలో మంచినీరు తాగుతున్న విద్యార్థులు

నాగలాపురం: మండలంలోని టీపీ కోట ప్రైమరీ పాఠశాలలో సోమవారం వాటర్ బెల్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కేరళ రాష్ట్రంలో విజయవంతమైన ఈ కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీరమంగళం వెంకటరమణ సోమవారం నుంచి పాఠశాలలో విద్యార్థులందరూ ఉదయం, మధ్యాహ్నం వాటర్ బెల్ సమయంలో మంచినీరు తీసుకోవడం వలన శరీరంలో విష పదార్థాలు, మలినాలు చమట రూపంలో విసర్జితమవుతాయని, దీని వల్ల పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని హెచ్‌ఎం చెప్పారు. అలాగే శరీరంలో నీటి శాతం పెరిగి రోగ నిరోధక శక్తి కూడా పెరగడానికి ఇది దోహదపడుతుందన్నారు. ప్రతి రోజూ ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్టెల్లా మేరి, జి.వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

డీ వార్మింగ్ డే పోస్టర్ల ఆవిష్కరణ


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ శ్రీనివాస వర్మ

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేట పీహెచ్‌సీ ఆవరణలో సోమవారం వైద్య, ఆరోగ్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసవర్మ డీ వార్మింగ్ డే వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఆస్పత్రిని తనిఖీ చేసిన ఆయన అక్కడ మంగళవారం నిర్వహించనున్న డీవార్మింగ్ డే కార్యక్రమాన్ని వివరించారు. 1 నుంచి 19 ఏళ్ల వయసు వారు ఆల్బెండజోల్ మాత్రలు మింగవచ్చని చెప్పారు. అన్ని స్కూళ్లలోని విద్యార్థులకు ఈ మాత్రలు పంపిణీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు వద్దని వామపక్షాల ఆందోళన

బుచ్చినాయుడుకండ్రిగ: స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయరాదని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక సబ్‌స్టేషన్ వద్ద వామపక్షాలు ఆందోళన చేశాయి. వామపక్షాల నాయకులు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో విద్యుత్ చార్జీలు పెంచి వేల కోట్ల రూపాయలు పేద ప్రజలపై భారం మోపిందని విమర్శించారు. అనంతరం ట్రాన్స్‌కో ఏఈ చలపతికి వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో వామపక్ష నాయకులు కత్తిధర్మయ్య, నలుగూరి రమణయ్య, బాలగురవయ్య, రమణయ్య, చొక్కలింగం పాల్గొన్నారు.

ప్రజలను దోచుకోవడానికే..

కేవీబీపురం: స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో రాష్ట్రంలోని పేద,మధ్య తరగతి కుటుంబాలను దోచుకోవడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు దాసరి జనార్దన్ విమర్శి ంచారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును నిరసిస్తూ స్థానిక సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేశారు. అనంతరం ట్రాన్స్‌కో ఏఈ మునికుమార్‌కు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ప్రాంతీయ కార్యదర్శి నాగలాపురం నాగరాజు, మండల నాయకులు పాల్గొన్నారు.


శ్రీకాళహస్తి: నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

స్మార్ట్ మీటర్లతో జేబులకు చిల్లు

శ్రీకాళహస్తి: స్మార్ట్ మీటర్ల వాడకంతో వినియోగదారుల జేబులకు చిల్లులు పడతాయని వామపక్ష నాయకులు అన్నారు. పట్టణంలోని శ్రీకాళహస్తి టౌన్ రూరల్ ఏడీ కార్యాలయాల ముందు సోమవారం వామపక్షాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. తదనంతరం స్మార్ట్ మీటర్లను పగలగొట్టి నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు జనమాల గురవయ్య రొద్ద గోపి, మించల శివకుమార్, శ్రీనివాసులు, చారులత, మునిరాజా, జనార్దన్, మురళి, సీపీఎం నాయకులు అంగెరి పుల్లయ్య, గంధం మనీ, గురవయ్య, రాపూర్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు వద్దే వద్దు

ఏర్పేడు: స్మార్ట్ మీటర్ల వల్ల విద్యుత్ వినియోగదారుల జేబుకు చిల్లు పడటం ఖాయమని సీఐటీయూ మండల కార్యదర్శి కరీముల్లా అన్నారు. మండలంలోని పాపానాయుడుపేట ట్రాన్స్‌కో కార్యాలయం వద్ద సోమవారం సీఐటీయూ, రైతు సంఘం ఆధ్వర్యంలో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి రంగయ్య, రాంబాబు పాల్గొన్నారు.

రేణిగుంటలో..

రేణిగుంట: స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వద్దంటూ సోమవారం స్థానిక ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట మండల సీపీఎం నాయకులు ఆందోళన చేశారు. టౌన్ కార్యదర్శి ఈశ్వరమ్మ మాట్లాడారు. సీనియర్ నాయకులు శివానందం, ఎంపీటీసీ సభ్యురాలు రాజేశ్వరి, దిలీప్ బాషా పాల్గొన్నారు.

నాగలాపురం: స్థానిక ట్రాన్స్‌కో కార్యాలయం వద్ద సీపీఎం నాయకులు ఆందోళన చేశారు. వ్యవసాయ కార్మిక సంఘ నాయకుడు మురుగేశన్ ప్రసంగించారు. ఏఈ పృథ్వికి వినతి పత్రం ఇచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు పద్మ, దక్షిణామూర్తి, పార్తిబన్ పాల్గొన్నారు.